ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



తమిళనాడు

TAMILNADU

సోమవారం 30 జూన్ 2025



పరుగుకు సిద్ధమైన కరెంటు బస్సులు

చెన్నై, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో వాయుకాలుష్యాన్ని తగ్గించే దిశగా మహానగర రవాణా సంస్థ ఎలక్ట్రిక్ బస్ సర్వీసులను సోమవారం ఉదయం ప్రవేశపెట్టనుంది. ఈ ఎలక్ట్రిక్ బస్సులను సీఎం ఎంకే స్టాలిన్ పచ్చజెండా ఊపి ప్రారంభించనున్నారు. మహానగర రవాణా సంస్థలో డీజిల్ బస్సులను నడుపుతుండటం వల్ల వాయుకాలుష్యం అధికమవుతున్నట్లు గమనించిన ఆ సంస్థ ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని నిర్ణయించింది. ఆ మేరకు రూ.697 కోట్లతో 625 లోఫ్లోర్ బోర్డు ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు సిద్ధమైంది. వ్యాసార్పాడి, పెరుంబాక్కం, పూందమల్లి, తండయార్‌పేట ప్రాంతాల నుంచి ఈ బస్సులను నడిపేందుకు ఛార్జింగ్ సెంటర్లు, సిబ్బంది బస కేంద్రాల తదితర సదుపాయాలను కల్పించింది. ప్రస్తుతం వ్యాసార్పాడి డిపో నుంచి 120 ఎలక్ట్రిక్ బస్సులను నడపనున్నారు. ఈ కొత్త ఎలక్ట్రిక్ సిటీ బస్సులు 11 రూట్లలో ప్రయాణించనున్నాయి. బ్రాడ్వే - పూందమల్లి (రూట్ నెం 52), బ్రాడ్వే - కిలాంబాక్కం (18ఏఎక్స్), కోయంబేడు - అన్నా స్క్వేర్ (27బి), బ్రాడ్వే - రెడ్‌హిల్స్ (242), బ్రాడ్వే - తిరునిండ్రవూరు (71ఇ), బ్రాడ్వే - తాంబరం వెస్ట్ (ఎ51), తిరువొత్తియూరు - పూందమల్లి (101), టోల్‌గేట్ - తిరువాన్మియూరు (6డి), కొరుక్కుపేట - ఐస్‌హౌస్ (32బి) మార్గాల్లో ఈ బస్సులు నడుస్తాయని రవాణా సంస్థ ఉన్నతాధికారులు తెలిపారు.

మాంగాడు కామాక్షి ఆలయంలో
రోజంతా ప్రసాదం

● ప్రారంభించిన మంత్రులు

చెన్నై, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా మాంగాడు కామాక్షి అమ్మన్ ఆలయంలో ఆదివారం ఉదయం భక్తులకు రోజంతా ప్రసాద పంపిణీ పథకాన్ని రాష్ట్ర మంత్రులు పీకే శేఖర్‌బాబు, దామో అన్బరసన్ ప్రారంభించారు. రాష్ట్రంలోని సుప్రసిద్ధ వైష్ణవ, శైవ ఆలయాల్లో భక్తులకు నిరంతర అన్నదానం, రోజంతా ప్రసాద పంపిణీ పథకాలు అమలవుతున్నాయి. ఈ పథకాల విస్తరణలో భాగంగా మాంగాడులోని కామాక్షి అమ్మవారి ఆలయంలో రోజంతా భక్తులకు ప్రసాద వితరణ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, హిందూ దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ సి.పళని, కాంచీపురం జిల్లా కలెక్టర్ కలైసెల్వి మోహన్, కుండ్రత్తూరు మురుగన్ ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీకన్య తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ప్రసాదాల పంపిణీ



శ్రీలంక నావికాదళం దాడి

● 8 మంది రామేశ్వరం జాలర్ల అరెస్టు

చెన్నై, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో మన్నార్ జలసంధి ప్రాంతంలో చేపలవేట సాగిస్తున్న రామేశ్వరానికి చెందిన ఎనిమిది మంది జాలర్లపై శ్రీలంక నావికాదళం విరుచుకుపడింది. భారత సముద్రజలాల్లోకి గస్తీ నౌకతో చొరబడి జాలర్లపై దాడి జరిపి నిర్బంధించింది. రామేశ్వరం నుంచి మత్స్యశాఖ అనుమతితో శనివారం వేకువజాము సుమారు 200 పడవల్లో జాలర్లు చేపలవేటకు బయలుదేరారు. వీరిలో రామేశ్వరం వేర్కాడు ప్రాంతానికి చెందిన జేసు(39), అన్నామలై(55), కళ్యాణరామన్(45), సయ్యద్ ఇబ్రహీం(35), మునీశ్వరన్(35), సెల్వం(28), కండివేల్ సహా ఎనిమిది మంది జాలర్లు మరపడవలో ఆదివారం వేకువజాము చేపలుపడుతుండగా గస్తీనౌకలో అక్కడికి చేరుకున్న శ్రీలంక నావికాదళం సభ్యులు చుట్టుముట్టి వారిపై దాడి జరిపారు. ఆ తర్వాత పడవలో ఉన్న లక్షలాది రూపాయల విలువైన పరికరాలు, చేపలు, వలలను స్వాధీనం చేసుకుని, జాలర్లను నిర్బంధించి శ్రీలంకలోని మన్నార్ నావికాదళం శిబిరానికి తీసుకెళ్లారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న రామేశ్వరంలోని జాలర్ల కుటుంబీకులు, జాలర్ల సంఘాల సమాఖ్య నాయకులు తీవ్ర ఆందోళన చెందారు. అరెస్టయిన జాలర్లను విడిపించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిన రామేశ్వరం జాలర్లు

నిండిన మెట్టూరు డ్యాం

10 జిల్లాలకు వరద హెచ్చరిక

నిండు కుండలా మెట్టూరు డ్యాం



చెన్నై, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మెట్టూరు డ్యాం పూర్తిస్థాయిలో నిండింది. కర్ణాటకలోని కృష్ణరాజసాగర్ తదితర జలాశయాల పరివాహక ప్రాంతాల్లో భారీగా కురిసిన వర్షాల కారణంగా ఆ జలాశయాల నుంచి విడుదలైన జలాలు మెట్టూరు జలాశయంలోకి ప్రవేశించడంతో డ్యాం నీటిమట్టం పూర్తి స్థాయికి చేరింది. దీంతో మెట్టూరు డ్యాం నుంచి భారీగా అదనపు జలాలను విడుదల చేయనుండడంతో కావేరి నదీతీరంలోని పది జిల్లాల్లో వరదలు సంభవిస్తాయని నీటివనరుల శాఖ ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం ఉదయం ఆ డ్యాంలో 120 అడుగుల వరకు నీటిమట్టం పెరిగి పూర్తిస్థాయికి చేరింది. దీంతో డ్యాం నుంచి అదనపు జలాలను విడుదల చేయనున్నారు. ఈ కారణంగా కావేరి తీరంలో పల్లపు ప్రాంతాల్లో వరదలు సంభవించే అవకాశాలున్నాయని, ఆ ప్రాంతాల్లో నివసించేవారంతా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు ప్రకటనలు జారీ చేస్తున్నారు. సేలం, ఈరోడ్, నామక్కల్, కరూరు, తిరుచ్చి, అరియలూరు, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, కడలూరు జిల్లాలకు వరద హెచ్చరికలు జారీ చేశారు. మెట్టూరు డ్యాం వద్దనున్న వరద నిరోధక కేంద్రంలో నీటివనరుల శాఖ ఉన్నతాధికారులు బస చేసి, డ్యాంలో నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.



ఉధృతంగా హొగేనకల్ జలపాతం

హొగేనకల్‌లో...

ఇదిలా ఉండగా ధర్మపురి జిల్లా హొగేనకల్ జలపాతంలోనూ ఆదివారం ఉదయం నీటి ఉధృతి అధికమైంది. శనివారం సాయంత్రం ఆ జలపాతంలోకి ఉధృతంగా నీరు చేరుతోంది. అయితే ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు తగ్గుముఖం పట్టాయి. ఆ మేరకు సెకనుకు 58 ఘనపుటడుగుల మేరకు జలాలు ప్రవేశిస్తున్నాయి. ఐదురోజులుగా ఆ జలపాతంలో నీటి ఉధృతి అధికం కావటంతో ఆ ప్రాంతాన్ని దర్శించేందుకు పర్యాటకులను అనుమతించడం లేదు. ప్రస్తుతం ప్రధాన జలపాతం, సినీఫాల్స్ తదితర ప్రాంతాల్లో కట్టలు తెంచుకుని జలాలు వేగంగా ప్రవహిస్తున్నాయి. పర్యాటకుల కాలినడక దారిని స్థానిక అధికారులు మూసి వేశారు.

● కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకం

నిబంధనల సడలింపు

టి.నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నిరుపేద గృహిణులకు ప్రతి నెలా రూ.1000 చెల్లించే కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకం కోసం దరఖాస్తు చేసుకునేవారికి కొన్ని నిబంధనలను సడలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు టైం స్కేల్ వేతనంతో ప్రభుత్వ శాఖల్లో పనిచేసి ప్రస్తుతం ఫించన్ పొందుతున్న కుటుంబాల్లో పెన్షన్ పొందని మహిళలు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇదే విధంగా ప్రభుత్వ శాఖల్లో రాయితీ పొంది దాని ద్వారా నాలుగు చక్రాల వాహనం కలిగి ఉన్న కుటుంబాలలోని మహిళలు కూడా ఈ నగదు పంపిణీ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందిరాగాంధీ జాతీయ వితంతు పింఛన్ పొందుతున్నవారి కుటుంబాలకు చెందిన, ఎలాంటి పెన్షన్ పొందని మహిళలు కూడా ఈ పథకానికి దరఖాస్తులు సమర్పించుకోవచ్చు. భర్త ద్వారా నిరాదరణకు గురై 50 యేళ్ల వయస్సులో పునర్వివాహం చేసుకోని మహిళకిచ్చే పింఛను పొందుతున్న మహిళకు చెందిన కుటుంబంలో సభ్యురాలిగా ఉన్న, ఎలాంటి సంపాదనలేని మహిళ కూడా కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకం కోసం దరఖాస్తు చేయవచ్చునని ప్రభుత్వం పేర్కొంది.

బీజేపీ పుదుచ్చేరి అధ్యక్షుడిగా రామలింగం

పుదుచ్చేరి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరి బీజేపీ అధ్యక్షుడిగా వీపీ రామలింగం సోమవారం తన పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. పుదుచ్చేరి ఎన్నార్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎస్.రంగస్వామి నేతృత్వంలో ఎన్నార్ కాంగ్రెస్ - బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం కొనసాగుతోంది. మంత్రివర్గంలో బీజేపీ తరుఫున భాగస్వామ్యం వహించిన ఆదిద్రావిడుల సంక్షేమశాఖ మంత్రి సాయి శరవణకుమార్ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో మంత్రిగా బీజేపీ ఎమ్మెల్యే జాన్‌కుమార్ నియమితులయ్యారు. అదేవిధంగా నియామక ఎమ్మెల్యేలుగా ఉన్న వెంకటేశన్, వీపీ రామలింగం, అశోక్‌బాబు కూడా రాజీనామా చేశారు. వీరి స్థానంలో సెల్వం, మాజీ ఎమ్మెల్యే తీపాయిందాన్, కారైక్కాల్ రాజశేఖర్‌ను బీజేపీ అధిష్ఠానం నియమించింది. దీనికి సంబంధించిన సిఫారసు లేఖను సీఎం రంగస్వామి శనివారం సాయంత్రం గవర్నర్ కైలాష్‌నాథ్‌కు అందజేశారు. గవర్నర్ ప్రతిపాదన మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ రాత్రి 9 గంటలకు అనుమతులు జారీ చేసింది.





వీపీ రామలింగం

ఒక్కరే నామినేషన్ దాఖలు

ఈ నేపథ్యంలో, ఆదివారం ఉదయం పుదుచ్చేరి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి వీపీ రామలింగం మాత్రమే నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఆయనకు వ్యతిరేకంగా మరెవ్వరూ నామినేషన్ దాఖలు చేయనందువల్ల వీపీ రామలింగం ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. దీనికి సంబంధించిన అధికార ప్రకటన సోమవారం విడుదలవుతుంది. కాగా, కొత్త మంత్రి, కొత్తగా నియమితులైన ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం సోమవారం సాయంత్రం 4 గంటలకు రాజ్‌భవన్‌లో జరగనుంది.ఆ తర్వాత అసెంబ్లీ స్పీకర్ కార్యాలయంలో నియామక ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారోత్సవం జరుగుతుంది. ఆ తర్వాత ముదలియార్‌పేటలోని సుకన్య కన్వెన్షన్ సెంటర్‌లో పుదుచ్చేరి బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడిగా వీపీ రామలింగం పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు.ఈ వేడుకల్లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ సుఘ్, కేంద్ర పరిశీలకుడు నిర్మల్‌కుమార్ సురాన, బీజేపీ ఎమ్మెల్యేలు, పార్టీ నిర్వాహకులు పాల్గొంటారు.

14 సబ్‌జైళ్ల మూత

● త్వరలో ఇతర జైళ్లకు ఖైదీల తరలింపు

టి.నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 14 సబ్ జైళ్లను శాశ్వతంగా మూసివేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈ జైళ్లలో ఉన్న ఖైదీలను సమీప ప్రాంతాల్లో ఉన్న జైళ్లకు తరలించనున్నట్లు పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా జైళ్ల శాఖ ఆధ్వర్యంలో 9 సెంట్రల్ జైళ్లు, 14 జిల్లా జైళ్లు, 5 మహిళా జైళ్లు, 106 సబ్ జైళ్లు, 3 ఓపెన్ ఎయిర్ జైళ్లు, 4 స్పెషల్ సబ్ జైళ్లు... మొత్తం 141 జైళ్లు ఉన్నాయి. ఈ జైళ్లలో సుమారు 20 వేలమంది ఖైదీలు ఉన్నారు. వీరిలో 70 శాతం మంది విచారణ ఖైదీలు కాగా, 30 శాతం ఖైదీలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా భద్రతలేని, దుస్థితిలో ఉన్న, ఖైదీలకు కనీస సదుపాయాలు లేని, చాలినంత ఖైదీలు లేని జైళ్లను మూసివేయాలని సుప్రీంకోర్టు ఇటీవల ఉత్తర్వు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను అమలు చేయడానికి రెవెన్యూ, న్యాయ, జైళ్ల శాఖల ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేసుకుని, ఆ కమిటీ పరిశీలన జరిపి నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. ఆ ప్రకారం మూడుశాఖల ఉన్నతాధికారుల కమిటీ ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జైళ్లను పరిశీలించి 19 సబ్‌జైళ్లను మూసివేయాలని ప్రతిపాదించింది. ఆ మేరకు కమిటీలో సభ్యుడిగా ఉన్న జైళ్ల ఏడీజీపీ మహేష్‌కుమార్ దయాళ్ ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపారు. ఆ ప్రతిపాదనను పరిశీలించిన రాష్ట్ర హోంశాఖ వాటిలో 14 సబ్ జైళ్లను శాశ్వతంగా మూసివేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. చెంగల్పట్టు జిల్లా మదురాంతకం, తిరువణ్ణామలై జిల్లా ఆరణి, కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయం, కడలూరు జిల్లా కడలూరు, కడలూరు హార్బర్, నామక్కల్ జిల్లా రాశిపురం, పరమత్తివేలూరు, తిరుచ్చి జిల్లా మనప్పారై, ముసిరి, పుదుకోట జిల్లా కీరనూరు, రామనాథపురం జిల్లా తిరువట్టానై, తంజావూరు జిల్లా పట్టుకోట, విరుదునగర్ జిల్లా సాత్తూరు, తూత్తుకుడి జిల్లా తిరుచెందూరులోని సబ్‌జైళ్లను శాశ్వతంగా మూసివేస్తూ రాష్ట్ర హోంశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈ జైళ్లలో ఉన్న ఖైదీలను సమీప ప్రాంతాల్లో ఉన్న జైళ్లకు దశలవారీగా తరలించనున్నారు.

● బాలుడి కిడ్నాప్ వ్యవహారం...

కుటుంబ సభ్యులతో పరారీలో
ఎమ్మెల్యే జగన్‌మూర్తి



అడయార్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కిడ్నాప్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చిన నేపథ్యంలో కేవీ కుప్పం ఎమ్మెల్యే జగన్‌మూర్తిని అరెస్టు చేసేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.దీంతో ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. తిరువళ్లూరు జిల్లా తిరువాలంగాడుకు చెందిన ధనుష్ (23) తేని జిల్లాకు చెందిన విజయశ్రీ (21)ని ప్రేమ వివాహం చేసుకున్నాడు.వీరి వివాహం గత నెల 15న రిజిస్టర్ ఆఫీసులో జరిగింది. అయితే, ఈ ప్రేమ వివాహాన్ని యువతి తల్లిదండ్రులు వ్యతిరేకించారు. దీంతో తమకు రక్షణ కల్పించాలని తక్కోలం, తిరువళ్ళూరు, చెన్నై పోలీస్ స్టేషన్లలో వినతిపత్రం సమర్పించారు. ఆ నేపథ్యంలో తిరువళ్లూరు జిల్లా కలాంబాక్కానికి చెందిన ధనుష్ సోదరుడు ఇంద్రచంద్(18)ను గుర్తు తెలియని ముఠా పోలీస్ ఉన్నతాధికారి ఏడీజీపీ జయరామన్ వాహనంలో వచ్చి కిడ్నాప్ చేసింది.కొంత సమయం తర్వాత మళ్లీ అదే ప్రాంతానికి తీసుకొచ్చి అతడిని వదిలివెళ్లారు. ఈ కిడ్నాప్ వ్యవహారంలో పురట్చి భారతం కట్చి అధ్యక్షుడు, కేవీ కుప్పం ఎమ్మెల్యే జగన్‌మూర్తి హస్తం ఉన్నట్టు ఇంద్రచంద్ తల్లి పోలీసులకు ఫిర్యాదుచేసింది. దీంతో జగన్‌మూర్తితో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో జగన్‌మూర్తిని అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న జగన్‌మూర్తి ఈ కేసులో అరెస్టు కాకుండా ముందస్తు బెయిల్ కోసం తిరువళ్లూరు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. దీంతో జగన్‌మూర్తి తన కుటుంబ సభ్యులతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. కాగా, ఆయన ఆచూకీ కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ కేసులో కిడ్నాప్‌కు సహకరించిన అదనపు డీజీపీ జయరామన్‌పై కేసు నమోదు చేసి పోలీసులు విచారణ జరిపారు. అలాగే, ఈ కేసులో జగన్‌మూర్తిని కూడా పోలీసులు పది గంటలపాటు విచారించిన విషయం తెల్సింది.ఈ కేసును సీబీసీఐడీ విచారిస్తోంది.

పోలీసు కస్టడీలో ఆలయ వాచ్‌మన్ మృతి

● ఆరుగురు పోలీసుల సస్పెన్షన్



అజిత్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగల చోరీ కేసులో పోలీసుల కస్టడీలో ఉన్న ఆలయ వాచ్‌మెన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మదురై జిల్లా తిరుమంగళంకు చెందిన నిక్తా (41), ఆమె తల్లి శివగామి శనివారం శివగంగ జిల్లా మాడప్పురం ఆలయానికి కారులో వెళ్లారు. ఆలయ ప్రాంగణంలోకి వెళ్లిన నిక్తా, ఆ సమయంలో అక్కడ ట్రాఫిక్ విధుల్లో ఉన్న ఆలయ వాచ్‌మన్, మడప్పురానికి చెందిన అజిత్‌కుమార్ (28)కు తన కారును రోడ్డు పక్కగా నిలపాలని తాళాలు అందజేసింది. తనకు కారు నడపడం రాదని తెలిపిన అజిత్‌కుమార్, మరొకరి ద్వారా కారును రోడ్డు పక్కగా పార్కింగ్ చేయించాడు. దర్శనం ముగించుకుని వచ్చిన నిక్తాకు అజిత్‌కుమార్ తాళాలు అందించాడు. కారు డోరు తీసిన నిక్తా, తన బ్యాగ్‌లో దాచిన తొమ్మిదన్నర సవర్ల నగదు అదృశ్యం కావడం గుర్తించి అజిత్‌కుమార్‌ను ప్రశ్నించింది. తనకు తెలియదని అజిత్‌కుమార్ బదులివ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. మానామదురై నేర విభాగం పోలీసులు అక్కడకు చేరుకుని, అజిత్‌కుమార్‌ను విచారణకు ఓ వ్యాన్‌లో తీసుకెళ్లారు. సాయంత్రం 6 గంటల సమయంలో అజిత్‌కుమార్ అస్వస్థతకు గురైనట్లు పేర్కొన్న పోలీసులు, అతన్ని శివగంగలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్సలు చేయించారు. అనంతరం మెరుగైన వైద్యసేవలకు మదురైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అతనిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న అజిత్‌కుమార్ బంధువులు త్రిభువనం పోలీస్ స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసు ఉన్నతాధికారులు అక్కడికి చేరుకుని వాచ్‌మన్ కుటుంబీకులతో చర్చించారు. ఈ సంఘటనకు సంబంధించి త్రిభువనం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ప్రభు, కన్నన్, శంకర్ మణికంఠన్, రాజా, ఆనంద్, రామచంద్రన్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

తగ్గిన చేపల ధర

● కాశిమేడులో కొనుగోలుదారుల రద్దీ

ప్యారీస్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సముద్రంలో చేపలవేట నిషేధ కాలం ముగిసి రెండు వారాలు దాటడంతో చేపల ధరలు తగ్గుముఖం పట్టాయి. రాయపురం సమీపంలో కాశిమేడు ఫిషింగ్ హార్బర్ నుంచి 600 పైగా మరపడవల్లో సముద్రంలోకి వెళ్ళిన జాలర్లకు విస్తారంగా చేపలు పట్టుబడ్డాయి. గత వారం కంటే ఈ ఆదివారం కాశిమేడులో వంజరం, పారై, కొడువా, తిరుక్కైనండూరు, రొయ్యలు, మెత్తాళ్ళు, సొరచేపల ధరలు రూ.200 వరకు తగ్గాయి. గత వారం కిలో రూ.1,300కు విక్రయించిన వంజరం రూ.1,100కు తగ్గింది. అలాగే కొడువా రూ.500, సంకర రూ.350, కిలో రొయ్యలు రూ.350కి విక్రయించడంతో మాంసాహారులు పోటీపడి కొనుగోళ్లు చేయడంతో వ్యాపారులు హర్షం వ్యక్తంచేశారు.



కాశిమేడులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న చేపలు

సమాచార దర్శిని

4న మాజీ సైనికుల జాబ్ మేళా

పెరంబూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం వైమానిక దళం మైదానంలో జూలై 4వ తేది మాజీ సైనికులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. త్రివిధ దళాల్లో పనిచేసిన సైనికులను ప్రైవేటు కార్యాలయాల్లో సెక్యూరిటీ ఆఫీసర్, గార్డులు, సమాచార శాఖ, ట్రాఫిక్, ఆరోగ్యం సహా పలు రంగాల్లో ఉద్యోగ అవకాశం కల్పించనున్నారు. ఆసక్తి కలిగిన మాజీ సైనికులు www.esmhire.com, www.dgrindia.gov.inలో పేర్లు నమోదు చేసుకోవచ్చని ప్రకటనలో తెలిపారు.

పంట రుణ మాఫీ బకాయిలకు రూ.834 కోట్ల విడుదల

పెరంబూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకుల్లో మాఫీ చేసిన పంట రుణాలు రూ.12,110 కోట్లకు చివరి విడతగా రూ.834 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. 2021 జనవరి గణాంకాల ప్రకారం 16.43 లక్షల మంది రైతుల రూ.12,110 కోట్ల పంట రుణాలు మాఫీ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మాఫీకి సంబంధించిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగా యేటా విడుదల చేస్తుంది. ఆ ప్రకారం, ఇప్పటివరకు రూ.11,379 కోట్లు విడుదల చేసింది. మిగిలిన రూ.731 కోట్లు, అందుకు వడ్డీ రూ.12 కోట్లు, 2021 ఫిబ్రవరి 1 నుంచి ఆ ఏడాది మార్చి 31వ తేది వరకు 59 రోజుల వడ్డీ రూ.89 కోట్లు కలిపి మొత్తం రూ.834 కోట్లను అందజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

తాంబరం - తిరుచ్చి ప్రత్యేక రైళ్ల సేవల పొడిగింపు

పెరంబూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తాంబరం - తిరుచ్చి ప్రత్యేక రైళ్ల సేవలు జూలై 30వ తేది వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ రైల్వే పేర్కొంది. ఈ ప్రకారం, తాంబరం నుంచి తిరుచ్చికి ప్రతి మంగళ, బుధ, శుక్ర, శని, ఆదివారాల్లో నడిపే ప్రత్యేక రైళ్ల సేవలు జూలై 30వ తేది వరకు పొడిగించింది. ఈ రైళ్ల ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైంది.

స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టిక్కెట్ల విడుదల

పెరంబూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుకు సంబంధించి స్పెషల్ సప్లిమెంటరీ హాల్ టిక్కెట్లు విడుదలయ్యాయి. ఏప్రిల్‌లో నిర్వహించిన ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సు చివరి సెమిస్టర్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని వారు, అరియర్స్ ఉన్న విద్యార్థులకు స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు జూలై 30 నుంచి ఆగస్టు 16వ తేది వరకు, ప్రాక్టికల్ పరక్షలు జూలై 17 నుంచి 25వ తేది వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేసుకున్న వారు https://dipexamstn-dte.inలో తమ పరీక్ష రిజిస్ట్రేషన్ నెంబరు, పుట్టిన తేది నమోదుచేసి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సాంకేతిక విద్య కమిషనర్ ఇన్నసెంట్ దివ్య ఒక ప్రకటనలో తెలిపారు ఈ పరీక్షా ఫలితాలు జూలై 30వ తేది విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

600 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం

పెరంబూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా అత్తిపట్టులో విద్యుత్ బోర్డుకు ఉత్తర చెన్నై విస్తరణ థర్మల్ విద్యుత్ కేంద్రం ఉంది. ఈ కేంద్రంలో తలా 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్లు పనిచేస్తున్నాయి. మొదటి యూనిట్‌లో శనివారం వేకువజామున 2.29 గంటలకు బాయిలర్ ట్యూబ్ పంక్చర్ కారణంగా ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో, నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో విద్యుత్ సరఫరా చేసిన విద్యుత్ బోర్డు, మొదటి యూనిట్‌కు మరమ్మతులు చేపట్టింది.

చెన్నై - బ్యాంకాక్ విమానంలో సాంకేతిక లోపం

పెరంబూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి ఆదివారం బ్యాంకాంక్ వెళ్లాల్సిన విమానంలో సాంతికేలోపం తలెత్తడంతో, ఆ విమాన సేవ రద్దు చేశారు. చెన్నై నుంచి థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాంక్‌కు 146 మంది ప్రయాణికులతో బయల్దేరుందుకు సిద్ధంగా ఉన్న విమానంలో పైలెట్ తుది తనిఖీలు చేపట్టారు. యంత్రంలో సాంకేతికలోపం ఉన్నట్లు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. ప్రయాణికులను విమానం నుంచి దింపి హోటళ్లకు తరలించి, సాంకేతిక లోపం సరిదిద్దే చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి లేదా సోమవారం ఉదయం విమానం బయల్దేరి వెళుతుందని థాయ్ ఎయిర్‌వేస్ విమాన సంస్థ తెలిపింది.

చెట్టు కొమ్మ విరిగిపడి విద్యార్థి మృతి

పెరంబూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తరగతి గది నుంచి బాత్రూంకు వెళ్తున్న విద్యార్థిపై చెట్టు కొమ్మ విరిగిపడి మృతి చెందాడు. తిరుప్పూర్ జిల్లా కాంగేయం ప్రాంతానికి చెందిన రాజ్‌కుమార్ కుమారుడు ఆత్యయన్ (15) శివమలైలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. ఘటన జరిగిన రోజు మధ్యాహ్నం 3.45 గంటలకు తరగతి గది నుంచి బాత్రూం వెళుండగా చెట్టు కొమ్మ విరిగిపడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఉపాధ్యాయులు వెంటనే బాలుడిని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

పీఎంకేను వీడను: జీకే మణి



జీకే మణి

టి.నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తాను త్వరలో మరో పార్టీలో చేరనున్నట్లు వదంతులు పుట్టించొద్దని పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) గౌరవాధ్యక్షుడు జీకే మణి పేర్కొన్నారు. ఇటీవల అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న జీకే మణి తైలాపురం గార్డెన్‌లో పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌తో భేటీ అయ్యారు. ఆ తర్వాత విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రాందాస్, అన్బుమణి రాందాస్ మధ్య అభిప్రాయ బేధాలు త్వరలో సమసిపోతాయని చెప్పారు. పార్టీలో తాను ఉన్నత పదవులలో ఉన్నప్పుడు ఎలాంటి విమర్శలు రాలేదన్నారు. అన్నాడీఎంకేలో చేరితే ప్రభుత్వ సంస్థల్లో ఒకదానికి చైర్మన్ పదవి ఇస్తానని, ఎమ్మెల్యే పదవిని ఇస్తానని, మంత్రి పదవి ఇస్తాననని అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ ఆశ చూపారన్నారు. అప్పటి డీఎంకే అధ్యక్షుడు, సీఎం కరుణానిధి కూడా తనకు ఉప ముఖ్యమంత్రి పదవిని ఇస్తానని చెప్పారన్నారు. ఇక జయలలిత అన్నాడీఎంకేలో చేరమంటూ పదేపదే ఒత్తిడి చేశారన్నారు. ఆ ముగ్గురు నేతలు పట్టుబట్టినా తాను పార్టీ నుంచి వైదొలగలేదన్నారు. పార్టీ వ్యవస్థాపకుడు రాందాస్ కోసం ప్రాణమైనా ఇస్తానన్నారు. ఒంటరిగా ఉన్నప్పుడు రాందాస్ తమతో మాట్లాడుతున్నప్పుడు కళ్ళనీళ్లు పెట్టుకుంటున్నారని, 87 యేళ్ళ వయస్సులో ఉన్న ఆయన్ను ప్రసారమాధ్యమాలు కించపరచటం భావ్యం కాదన్నారు. పార్టీలో అన్బుమణి కీలక పాత్రను పోషిస్తున్నారని, ఆయనను తానెప్పుడూ తక్కువగా అంచనా వేయలేదన్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో ఏ కూటమిలో చేరాలనే విషయంపై రాందాస్, అన్బుమణి కలిసి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

పోలీసు వాహనానికి జరిమానా



వాహనానికి జరిమానా విధిస్తున్న మహిళా పోలీసు గాయత్రి

పెరంబూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాకపోకల అంతరాయానికి కారణమైన పోలీసు వాహనానికి మహిళా ట్రాఫిక్ జరిమానా విధించింది. దీనిపై ప్రశంసలు జల్లు కురుస్తోంది. పుదుకోట కార్పొరేషన్ రాజావీధిలో శుక్రవారం సాయంత్రం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రోడ్డు మధ్యలో నిలిపిన ఓ కారు దీనికి కారణమని, ఆ కారుపై 'పోలీసు' అనే స్టిక్కర్ ఉంది. కారులో డ్రైవర్ సీటులో తాపీగా కూర్చున్న వ్యక్తి, వాహన చోదకులు ఎంతచెప్పినా వినకుండా రోడ్డు మధ్యలోనే ఉంచినట్లు సమాచారం. రద్దీ నియంత్రణలో ఉన్న మహిళా ట్రాఫిక్ పోలీసు గాయత్రి అక్కడకు చేరుకుని, 'నో పార్కింగ్' ప్రాంతంలో కారు నిలిపినందుకు రూ.2,500 జరిమానా విధించింది. కారుపై పోలీసు అనే స్టిక్కర్ ఉన్నా తన విధులు సక్రమంగా నిర్వహించిన మహిళా ట్రాఫిక్ పోలీసు గాయత్రిని పలువురు అభినందించారు.

తల్లి మందలించడంతో విద్యార్థి ఆత్మహత్య

పెరంబూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): హోటల్‌లో ఎందుకు భోజనం తిన్నావని తల్లి మందలించడంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తేని జిల్లా కుమనన్‌తొళు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కుమార్ - మహాలక్ష్మి కుమారుడు దిలీప్‌కుమార్ (13) నాగలాపురంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఘటన జరిగిన రోజు రాత్రి ట్యూషన్ నుంచి దిలీప్‌కుమార్ ఇంటికి వచ్చాడు. తల్లితో ఫ్రైడ్ రైస్ కావాలని కోరగా, మహాలక్ష్మి అతనికి డబ్బులు అందజేసింది. హోటల్‌కు వెళ్లి ఫ్రైడ్ రైస్ తిన్న దిలీప్‌కుమార్ రాత్రి 9 గంటలకు ఇంటికి తిరిగొచ్చాడు. ఆ సమయంలో, రోజూ హోటల్‌లోనే తింటున్నావు అంటూ మహాలక్ష్మి కుమారుడిని మందలించినట్లు సమాచారం. దీంతో మనస్తాపం చెందిన దిలీప్‌కుమార్ తన గదిలోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న మైలాడుంపారై పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడి మృతి

వాషర్‌మెన్‌పేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. దిండుగల్ జిల్లా పళని గౌండన్‌కుళానికి చెందిన మయిల్‌స్వామి (65) గత గురువారం పళని - పుదుతారాపురం రోడ్డు రామకృష్ణ హోటల్ సమీపంలో రోడ్డుపై నడిచి వెళ్తుండగా ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలతో కోయంబత్తూర్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన, శనివారం మృతిచెందాడు. ఈ ఘటనపై పళని నగర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కారులో 50 కిలోల గుట్కా స్వాధీనం

● యువకుడి అరెస్టు



తిరుత్తణి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు సమీపంలోని కనకమ్మసత్రం హైవే మార్గంలో కారులో అక్రమంగా తరలిస్తున్న 50 కిలోల గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం సాయంత్రం కనకమ్మసత్రం-చెన్నై రహదారిలో తనిఖీలు జరుపుతున్న పోలీసులు వేగంగా వస్తున్న కారును నిలిపి తనిఖీ చేయగా అందులో 50 కిలోల గుట్కా, పొగాకు ప్యాకెట్లు ఉండటాన్ని గమనించారు. వెంటనే ఆ గుట్కాను స్వాధీనం చేసుకుని కారులో ఉన్న యువకుడిని అరెస్టు చేశారు.

ఎంజీఆర్ సహాయకుడు మహాలింగం మృతి



మహాలింగం (ఫైల్‌ఫొటో)

అడయార్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎం.జీ.రామచంద్రన్ సహాయకుడు మహాలింగం (72) మృతి చెందారు. వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వచ్చిన ఆయన శుక్రవారం రాత్రి నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. శివగంగ జిల్లా మానామదురైకు చెందిన మహాలింగం... 1972 -87లో ఎంజీఆర్ తుదిశ్వాస విడిచే వరకు సహాయకుడిగా పనిచేశారు. అలాగే, ఎంజీఆర్‌కు తనకు మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలపై ఓ పుస్తకాన్ని కూడా ప్రచురించారు. మహాలింగం మృతికి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి, మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం, ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ తదితరులు తమ ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు

హైదరాబాద్ - కన్నియాకుమారి మధ్య ప్రత్యేక రైళ్లు

ఐసిఎఫ్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి కన్నియాకుమారికి జూలై 2వ తేది నుంచి నాలుగు ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. నెం.07230 హైదరాబాద్ - కన్నియాకుమారి ప్రత్యేక రైలు జూలై 2, 9, 16, 23 తేదీల్లో హైదరాబాద్‌లో సాయంత్రం 5.20 గంటలకు బయల్దేరి మూడోరోజు వేకువజామున 2.30 గంటలకు కన్నియాకుమారి చేరుకుంటుంది. నెం.07229 కన్నియాకుమారి ప్రత్యేక రైలు జూలై 4, 11, 18, 25 తేదీల్లో కన్నియాకుమారి నుంచి తెల్లవారుజామున 5.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, చిత్తూరు, కాట్పాడి మీదుగా వెళతాయని దక్షిణ రైల్వే తెలిపింది.



వేలూరు కాట్పాడి ఇందిరా నగర్‌లో తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ పుట్టిన రోజు సందర్భంగా సహాయాలు అందజేస్తున్న ఆ పార్టీ జిల్లా సెక్రటరీ నవీన్, పార్టీ నిర్వాహకులు

గృహ విద్యుత్ ఛార్జీలు పెరగవు

● మంత్రి శివశంకర్

పెరంబూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నట్లు వస్తున్న వార్తలను ప్రజలు నమ్మవద్దని రవాణా, విద్యుత్ శాఖ మంత్రి పి.శివశంకర్ స్పష్టం చేశారు. జూలై 1 నుంచి పెంచిన విద్యుత్ ఛార్జీలు అమల్లోకి రానున్నట్లు సామాజిక మాధ్యమాలు, కొన్ని పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. ఈ విషయమై మంత్రి పి.శివశంకర్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... గృహ విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి ఛార్జీల పెంపు ఉండదని గత మే 20వ తేది స్పష్టంగా ప్రకటించామన్నారు. ఒకవేళ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ సిఫారసులతో ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు విద్యుత్ ఛార్జీల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని, ఆ సమయంలో కూడా గృహ విద్యుత్ ఛార్జీలు పెరిగే అవకాశం లేదన్నారు. ప్రస్తుతం అందిస్తున్న 100 యూనిట్ల ఉచిత విద్యుత్ సహా అన్ని రాయితీలు కొనసాగుతాయన్నారు.

ఆలయానికి ఆలస్యంగా వస్తానన్న భర్త

● మహిళ ఆత్మహత్య



శరణ్య (ఫైల్‌ఫొటో)

వేలూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆలయానికి ఆలస్యంగా వస్తానని భర్త తెలపడంతో, మనస్తాపం చెందిన మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. బెడుగత్తూర్ ఆసనాంపట్టు ప్రాంతానికి చెందిన ఆనందన్(30) కంప్యూటర్ సెంటర్ నడుపుతున్నాడు. ఆయనకు భార్య శరణ్య (20), కుమారుడు సంజీవన్(3), కుమార్తె తమిళ్ యోళిని (1) ఉన్నారు. శనివారం ఆనందన్ పుట్టిన రోజు కావడంతో, ఆలయానికి వెళ్లి పూజలు చేయిద్దామని శరణ్య భర్తను కోరింది. అందుకు ఆనందన్, కంప్యూటర్ సెంటర్ తెరచి కొద్దిసేపట్లో వస్తానని చెప్పాడు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహించిన శరణ్య గదిలోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకుంది. సమాచారం అందుకున్న ఆనైకట్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వేలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

ఆన్‌లైన్ నగదు మోసం కేసు

యువకుడి అరెస్ట్

వేలూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి నుంచి ఆన్‌లైన్‌లో రూ.కోటి నగదు మోసానికి పాల్పడిన వ్యవహారంలో పేర్నాంబట్టు యువకుడిని ఆ రాష్ట్ర పోలీసులు అరెస్ట్ చేశారు. పంజాబ్ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ప్రకటన నమ్మి రూ.కోటి పంపించాడు. అనంతరం ఈ విషయమై ఎలాంటి సమాచారం లేకపోవడంతో మోసపోయానని గుర్తించి ఆ రాష్ట్ర పోలీసులకు తెలిపారు. పోలీసుల విచారణలో... బెంగళూరు నుంచి ఆన్‌లైన్ మోసం జరిగినట్లు విచారణలో తెలుసుకున్న పోలీసులు, ఆ ప్రాంతానికి వెళ్లి ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారు పేర్నాంబట్టుకు చెందిన వసీం బ్యాంక్ అకౌంట్‌కు రూ.57 లక్షలు పంపించారని విచారణలో తెలుసుకున్నారు. ఈక్రమంలో పంజాబ్ పోలీసులు పేర్నాంబట్టు చేరుకుని వసీంను అరెస్ట్ చేసి పంజాబ్ రాష్ట్రానికి తీసుకెళ్లారు. ఈ ముఠా ఆన్‌లైన్‌లో సుమారు రూ.12 కోట్ల మేర మోసానికి పాల్పడిందని పంజాబ్ పోలీసులు తెలిపారు.

సాగునీటి పన్నుపై రైతు సంఘం ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

వేలూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సాగునీటికి పన్ను వేయాలనే కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందంటూ తమిళనాడు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. గుడియాత్తం శెట్టికుప్పంలో జరిగిన ఆందోళనకు గుడియాత్తం రైతు సంఘం అధ్యక్షుడు స్వామినాథన్ నేతృత్వం వహించగా, సంఘ నిర్వాహకులు సుందరవేలు, ఆర్ముగం, దేవరాజ్, సెల్వం, లోకన్, గోపి సహా పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

డీఎంకే సభ్యత్వ నమోదులో లక్ష్యాలు సాధించండి

● మంత్రి పి.మూర్తి

ఐసిఎఫ్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): డీఎంకే సభ్యత్వ నమోదులో లక్ష్యాలు సాధించాలని పార్టీ శ్రేణులకు పార్టీ మదురై జిల్లా కార్యదర్శి, రాష్ట్ర వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి పి.మూర్తి పిలుపునిచ్చారు. శనివారం జరిగిన మదురై తూర్పు జిల్లా డీఎంకే కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... ప్రతి పోలింగ్ బూత్‌లో ఉన్న ఓటర్లలో 30 శాతం మంది పార్టీ సభ్యులుగా చేర్చాలని పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ తెలిపారన్నారు. ఇప్పటికే డీఎంకే ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తున్నారని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సహాయాలను వారికి తెలియజేసి పార్టీ సభ్యులుగా చేర్పాలని మంత్రి పిలుపునిచ్చారు.

తాగునీటి కోసం రాస్తారోకో



బిందెలతో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

పెరంబూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని గ్రామస్తులు రాస్తారోకో చేపట్టారు. ఈరోడ్ జిల్లా నల్లూర్ పంచాయతీ పరిధిలో 100 కుటుంబాలు జీవిస్తున్నాయి. వీరికి కొళాయి ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. కొద్ది నెలలుగా నీటి సరఫరా సక్రమంగా జరగక పోవడంతో గ్రామస్తులు అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. వారు పట్టించుకోక పోగా, 20 రోజులకు ఒకసారి నీరు సరఫరా చేస్తుండంతో ఆదివారం ఉదయం బిందెలతో పులియంపట్టి-సత్యమంగళరం రోడ్డుపై బైఠాయించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. సమాచారం అందుకున్న భవానీసాగర్ తాలూకా అభివృద్ధి అధికారి ఇంద్రాణి పోలీసులతో అక్కడకు చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

కంటైనర్ లారీలో మంటలు



లారీలో మంటలు చెలరేగిన దృశ్యం

వేలూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దంపతుల మృతికి కారణమైన కంటైనర్ లారీలో హఠాత్తుగా మంటల చెలరేగి, అందులో తరలిస్తున్న రెండు కార్లు దగ్ధమయ్యాయి. బెంగళూరు నుంచి చెన్నైకు వెళుతున్న కంటైనర్ లారీ ఢీకొని ద్విచక్రవాహనంలో వెళ్తున్న రమేష్ - గోమతి దంపతులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఆకాశ్ యాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో, రోడ్డుపై నిలిపిన కంటైనర్ లారీ ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదానికి గురైంది. సమాచారం అందుకున్న వేలూరు అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపుచేసి, ప్రమాదంపై విచారణ చేపట్టారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈబీ తెలిపింది.

తాంబరం: సెంబాక్కం నూతన్‌జేరి మెయిన్ రోడ్డు, మామ్మార్తి అమ్మన్ ఆలయ వీధి, జ్యోతి నగర్, మాణిక్యం నగర్, బాలా గార్డెన్, జాయ్ నగర్, రాజ్‌ప్యారీస్ ఆదిత్య నగర్, నూతన్‌జేరి మాంబాక్కం మెయిన్ రోడ్డు, స్వామినాథపురం, వాతాపి నగర్, సభాపతి నగర్, వేణుగోపాలస్వామి నగర్, మారుతి నగర్, కృష్ణా వీధి, యమున వీధి, గోమతి వీధి, వైగై వీధి, వాసుకి నగర్, వివేకానందన్ వీధి, నేతాజీ వీధి, అయ్యప్ప నగర్ 1 నుంచి 7 వీధులు, ఈబీ కాలని, వెంకటాద్రి నగర్, బాలాజి నగర్, ఏఎల్‌ఎస్ పసుమై నీలం, పెరియార్ నగర్, లక్ష్మి నగర్, కొమ్మి అమ్మన్ నగర్, కక్కన్ వీధి

పల్లావరం: పాల్సన్ కార్యాలయం, అన్నాసాలై, కన్నాయిరం వీధి, నీలకంఠన్ వీధి, తిరునీర్‌మలై మెయిన్ రోడ్డు, ఎంజీ రాజా వీధి, ఇరట్టమలై శ్రీనివాసన్ వీధి, లూర్థు మాతా వీధి, పీటర్ వీధి, సభాపతి వీధి, నరసింహన్ వీధి, అంబేద్కర్ వీధి, జయమేరి వీధి, తిరు నగర్, భజన ఆలయ వీధి, మారియమ్మన్ ఆలయ వీధి, కల్యాణిపురం, ఆలయ వీధి, శేషా లైన్, కోదండన్ నగర్

షోళింగనల్లూర్: పల్లికరనై వీజీపీ శాంతి నగర్, మనోహర్ నగర్, ఐఐటీ కాలని, వేళచ్చేరి మెయిన్ రోడ్డు కొంత భాగం, అవ్వై వీధి, ముత్తమిళ్ నగర్, గవర్నమెంట్ కాలేజ్, బస్ డిపో, గవర్నమెంట్ హాస్పిటల్, టీఎన్‌ఎస్సీబీ అపార్ట్‌మెంట్స్ న్యూ బ్లాక్, భారతి నగర్, లైట్ హౌస్

పోరూర్: సిరుగళత్తూర్, కేళిత్తిపేట, నందంబాక్కం, పెరియార్ నగర్, అంజుగంబాక్కం, మలయంబాక్కం, కుండ్రత్తూర్ ప్రాంతం, బజార్ వీధి, మెత్తా నగర్, మనచ్చేరి, జి స్క్వయర్

అయప్పన్‌తాంగళ్: మౌంట్ పూందమల్లి రోడ్డు, పిళ్లయార్ ఆలయ వీధి, మురుగన్ ఆలయ వీధి, జేజే నగర్, అమ్మన్ నగర్, పీజీ అవెన్యూ, ఇందిరా నగర్, జానకిఅమ్మాళ్ నగర్, సాయి నగర్, వినాయకపురం, సోరన్‌పురి నగర్

వైభవంగా ఆంజనేయస్వామి విడయాత్రి ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో కనువిందు చేస్తున్న ఆంజనేయస్వామి

ప్యారీస్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరం సమీపంలోని పొన్నియమ్మన్‌మేడు మోహన్‌నగర్‌లో వున్న శ్రీ వెంకటాద్రి భజన సమాజం ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విడయాత్రి ఉత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. భజన సమాజం ఆధ్వర్యంలో ఈనెల 21, 22 తేదీల్లో శ్రీనివాస తిరుకల్యాణోత్సవం త్రిదండి అహోబిల రామానుజ జీయర్ పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా జరిగింది. ఇందుకు ఆంజనేయస్వామికి కృతజ్ఞతలు తెలిపేవిధంగా విడయాత్రి ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు, సీతారామ, లక్ష్మణులు, శ్రీమన్ భక్త పార్థసారథి రామానుజుల చిత్రపటాలను తులసీ దళాలతో, ఆంజనేయస్వామివారికి వడమాలలతో సుందరంగా అలంకరించారు. వేడుకల్లో భాగంగా భక్త బృందం అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. సమాజం తరుపున కె.పద్మరాజ్, కె.ఐశ్వర్య, దాతలకు కృతజ్ఞతలు తెలిపి భక్తులందరికి తీర్థ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

కాంగ్రెస్ సభలో పాల్గొనడం తప్పుకాదు

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయ్‌కాంత్



మీడియాతో మాట్లాడుతున్న ప్రేమలత విజయ్‌కాంత్

ప్యారీస్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నిర్వహించిన సభలో డీఎండీకే తరుపున సుదీశ్ పాల్గొనడం తప్పుకాదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయ్‌కాంత్ పేర్కొన్నారు. కోవైలో ఆమె ఆదివారం మీడియాతో మాట్లాడుతూ... కృష్ణగిరిలో నష్టపోయిన మామిడి రైతులకు మద్దతుగా సోమవారం తన అధ్యక్షతన ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ప్రజలకు ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందజేయాలని అప్పుడే రాష్ట్రం ప్రకాశవంతంగా ఉంటుందన్నారు. యేళ్ళ తరబడి కొనసాగుతున్న స్నేహం వల్లే తమ పార్టీ తరుపున సుదీశ్ కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్నారని, దీనికి రాజకీయాలతో ముడిపెట్టరాదన్నారు. 2026 జనవరి 9న కడలూరులో నిర్వహించనున్న డీఎండీకే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో అసెంబ్లీ ఎన్నికల పొత్తులపై నిర్ణయం ప్రకటిస్తామన్నారు. రాష్ట్రంలో ఏన్డీయే కూటమికి ప్రాంతీయ పార్టీ నాయకత్వం వహించాలన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ గత అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే తరుపున ప్రజలకిచ్చిన హామీల్లో ఒకటి కూడా పూర్తిగా నెరవేర్చలేదని, మత్తులో తూలుతున్న రాష్ట్రానికి మంచి జరగాలంటే ప్రభుత్వం మారాల్సిందేనని ప్రేమలత అభిప్రాయం వ్యక్తం చేశారు.

డీఎంకే కూటమిలో అధిక స్థానాలు కోరుతాం

● ఎంఎంకే అధ్యక్షుడు జవాహిరుల్లా

ఐసిఎఫ్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాబోయే శాసనసభ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో అధిక స్థానాలు కోరతామని మనిదనేయ మక్కల్ కట్చి (ఎంఎంకే) అధ్యక్షుడు జవాహిరుల్లా తెలిపారు. మదురైలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా ముస్లింలకు తగిన ప్రాతినిధ్యం లభించలేదన్నారు. లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ, స్థానిక సంస్థల్లో జనాభా సంఖ్య ఆధారంగా ముస్లింల ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. వక్ఫ్ ఆస్తులు స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతోనే బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ చట్టం తీసుకొచ్చిందన్నారు. ఈ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సుప్రీంకోర్టులో దాఖలుచేసిన పిటిషన్ త్వరలో విచారణకు రానుందని తెలిపారు. డీఎంకే ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తోందని జవాహిరుల్లా కొనియాడారు.

ముఖ్యమంత్రి అభ్యర్థిని బీజేపీ నిర్ణయిస్తుంది

● హెచ్.రాజా

పెరంబూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమిలో ముఖ్యమంత్రి అభ్యర్థిని బీజేపీ పార్లమెంటరీ కమిటీ నిర్ణయిస్తుందని, ఢిల్లీలో మోదీ ఉన్నట్లు, రాష్ట్రంలో ఎడప్పాడి ఉంటారని ఆ పార్టీ సీనియర్ నేత హెచ్.రాజా తెలిపారు. తిరుచ్చి జిల్లా తిరువెరుంబూర్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రైవేటు సంస్థలు పాతబడిన విమానాలు వినియోగిస్తున్నాయని, వీటిని అడ్డుకొనేలా కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగం అధికమైందని, ముఖ్యంగా తమిళ చలన చిత్ర పరిశ్రమ మొత్తం మాదకద్రవ్యాల బారిన పడిందన్నారు. పీఎంకేలో తలెత్తిన సమస్యకు బీజేపీ కారణమని పీసీసీ చీఫ్ సెల్వపెరుందగై చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించి అధికారం చేపడుతుందని హెచ్.రాజా ధీమాగా చెప్పారు.

మురుగన్‌తో బీజేపీ విజయం సాధ్యం కాదు

● సీపీఐ నేత ముత్తరసన్

వాషర్‌మెన్‌పేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాముడిని ముందుంచి అయోధ్యలో విజయం సాధించలేని బీజేపీ, రాష్ట్రంలో మురుగన్ ముందుంచి చేస్తున్న రాజకీయాలు ఫలించబోవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ తెలిపారు. దిండుగల్ జిల్లా సీపీఐ మహానాడు శనివారం జరిగింది. ఈ మహాసభలో పాల్గొన్న ముత్తరసన్ విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పార్టీ మహాసభలు నిర్వహిస్తున్నామని, అనంతరం ఆగస్టు 15 నుంచి సేలంలో రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. రాష్ట్ర మహాసభల్లో రెండో రోజు ముఖ్యమంత్రి స్టాలిన్, కూటమి పార్టీల నేతలు పాల్గొంటారని తెలిపారు. బీజేపీతో పొత్తును అన్నాడీఎంకే కార్యకర్తలు అంగీకరించడం లేదని, అలాగే, సంకీర్ణ ప్రభుత్వం అనే బీజేపీ ప్రకటనలు కూడా ఆ పార్టీ కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారని ముత్తరసన్ తెలిపారు.

సంకీర్ణ ప్రభుత్వం మంచిదే: జీకే వాసన్

వాషర్‌మెన్‌పేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సంకీర్ణ ప్రభుత్వం నిర్ణయం మంచిదేనని తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్ తెలిపారు. సేలంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి బలంగా ఉందన్నారు. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, అన్ని కూటమి పార్టీల అభిప్రాయం ఇదేనని అన్నారు. అదే సమయంలో భవిష్యత్తు ముఖ్యమంత్రి ఎవరూ అనేది అందరికి తెలిసిన విషయమేనన్నారు. అమిత్ షా పేర్కొన్నట్లు కూటమి తాము ధర్మాన్ని పాటించి ఎన్డీఏ కూటమి విజయానికి కృషి చేస్తామని జీకే వాసన్ తెలిపారు.

నెల్లయప్పర్ ఆలయంలో వియత్నాం భక్తులు



ధోవతి ధారణలో వియత్నాం భక్తులు

పెరంబూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నెల్లయప్పన్ ఆలయంలో వియత్నాం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తిరునల్వేలి టౌన్ నెల్లయప్పర్ - గాంధిమతి అమ్మవారి ఆలయ ఆణి ఉత్సవాల రథోత్సవం జూలై 8వ తేది జరగనుంది. ప్రసిద్ధిచెందిన ఈ ఆలయాన్ని పొరుగు రాష్ట్రాలు, విదేశాలకు చెందిన భక్తులు సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో, వియత్నాం దేశానికి చెందిన భక్తులు శనివారం ఆలయానికి వచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. వారు తమిళుల సంప్రదాయ దుస్తుల్లో ఒకటైన ధోవతి ధరించి దర్శనంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ... నెల్లయప్పర్ ఆలయంలోని శిల్పాలన్నీ అద్భుతంగా ఉన్నాయన్నారు. శివుడిని పూజించిన తర్వాత తమ మనస్సు ప్రశాంతంగా ఉందని పేర్కొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ వేలూరు కార్యవర్గం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న అతిథులు, నిర్వాహకులు

వేలూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా రోటరీ క్లబ్ ఆఫ్ వేలూరు ఆక్కార్డ్ సంఘ 2025-26వ సంవత్సరం కొత్త కార్యవర్గం ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టింది. స్థానిక తొరప్పాడిలో జరిగిన కార్యక్రమానికి రోటరీక్లబ్ మాజీ గవర్నర్ పళని అధ్యక్షత వహించగా, నారాయణి ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ బాలాజి స్వాగతం పలికారు. కాంచీపురం పచ్చయప్పన్ సిల్క్స్ డైరెక్టర్ పచ్చయప్పన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గం పదవీ ప్రమాణం చేశారు.

ఆవుల కొనుగోలుకు రుణాలు

వేలూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆవులు కొనుగోలు చేసి సంరక్షించాలనే రైతులకు రూ.1.20లక్షల వరకు రుణాలు అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అందించనున్న ఈరుణాలు పొందేందుకు నెం.044-27661888, 9445477929లలో సంప్రదించాలని కోరారు.



దర్శకుడు అశ్వత్‌కు షీల్డ్ అందిస్తున్న దృశ్యం

అట్టహాసంగా 'డ్రాగన్' శతదినోత్సవం

ఇటీవల సినిమాల వంద రోజుల విజయోత్సవాలు నిర్వహించడం గగనమైన నేపథ్యంలో యువ హీరో ప్రదీప్ రంగనాథన్, దర్శకుడు అశ్వత్ మారిముత్తు కాంబినేషన్‌లో వచ్చిన 'డ్రాగన్' విజయవంతంగా వంద రోజులను పూర్తి చేసుకుంది. దీన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి నగరంలో వంద రోజుల వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానరులో తెరకెక్కిన ఈ చిత్రాన్ని నిర్మాతలు కల్పాత్తి ఎస్.అఘోరం, కల్పాత్తి ఎస్.గణేష్, కల్పాత్తి ఎస్.సురేష్ సంయుక్తంగా నిర్మించారు. క్రియేటివ్ ప్రొడ్యుసర్‌గా అర్చన కల్పాత్తి వ్యవహరించారు. కయదు లోహర్, అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటించగా, కేఎస్ రవికుమార్, మిష్కిన్ తదితరులు ప్రధాన పాత్రలను పోషించారు. అతి తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఘన విజయం సాధించడంతో పాటు రూ.100 కోట్లకుపైగా రాబట్టింది. అదేసమయంలో ఈ రోజుల్లో వంద రోజుల ప్రదర్శనను విజయవంతంగా పూర్తి చేసుకున్న చిత్రంగా నిలిచింది. దీంతో హండ్రెడ్ డేస్ ఫంక్షన్ ఘనంగా నిర్వహించారు. ఇందులో ఏజీఎస్ గ్రూపు సీఎఫ్‌వో రంగరాజన్ అతిథులను ఆహ్వానించి వారికి వంద రోజుల షీల్డ్‌ను బహూకరించారు. ఈ చిత్రంలో నటించిన నటీనటులు, సాంకేతిక నిపుణులు, పలువురు థియేటర్ యజమానులు, పంపిణీదారులు, హీరో ప్రదీప్ రంగనాథన్, జార్జ్ మరియన్, రోహంత్ తదిరులు పాల్గొన్నారు. చిత్ర దర్శకుడు అశ్వత్ మారిముత్తు మాట్లాడుతూ.. 'ఈ నాలుగు గంటల విజయోత్సవాల సమయాన్ని ఒక అందమైన తరుణంగా భావిస్తున్నా. ఈ సినిమా విజయం కోసం శ్రమించిన ప్రతి ఒక్కరికీ షీల్డులు అందజేయాలని నిర్ణయించిన ఏజీఎస్ నిర్మాణ సంస్థ అధిపతులకు ధన్యవాదాలు. చిత్ర నిర్మాత చేతుల మీదుగా విజయోత్సవ షీల్డును అందుకోవడమే కళాకారుడుకి అతిపెద్ద విజయం' అని పేర్కొన్నారు. హీరో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ.. 'నేను, అశ్వత్ మంచి స్నేహితులైనప్పటికీ.. అతి తక్కువ సమయంలో మేమిద్దరం ఒక చిత్రానికి కలిసి పనిచేయడానికి ప్రధాన కారణం అభిమానులే. 'లవ్ టుడే'కి ముందే అశ్వత్ నాతో ఓ సినిమా చేస్తానని చెప్పాడు. అయితే, అతి తక్కువ కాలంలో జరుగుతుందని ఊహించలేదు' అన్నారు.

'ఓహో ఎందన్ బేబీ' ఆడియో రిలీజ్



హీరోహీరోయిన్లతో విష్ణు విశాల్

రోమియో పిక్చర్స్, విష్ణు విశాల్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'ఓహో ఎందన్ బేబీ'. రొమాంటిక్ ఎంటర్‌టైనర్. కృష్ణకుమార్ రామ్‌కుమార్ దర్శకుడు. నిర్మాత విష్ణువిశాల్. ఇందులో హీరోగా విష్ణువిశాల్ సోదరుడు రుద్ర హీరోగా వెండితెరకు పరిచయమవుతున్నారు. జూలై 11న విడుదల చేస్తున్నారు. ఆ చిత్రం ఆడియోను శనివారం నగరంలో విడుదల చేశారు. ఇందులో దర్శకుడు వెట్రిమారన్ ముఖ్య అతిథిగా హాజరై ఆడియోను రిలీజ్ చేశారు. ఈ వేడుకలో నిర్మాత ధనుంజయన్, నటుడు కార్తి, దర్శకుడు అశ్వత్ మారిముత్తు, నిర్మాత ఐసరి గణేష్, దర్శకులు మను ఆనంద్, త్యాగరాజా కుమారరాజా, చెల్ల అయ్యావు, నటుడు విజయ్ ఆదిరాజ్, సంగీత దర్శకుడు జెన్ మార్టిన్, నటి మిదిలా, చిత్ర దర్శకుడు కృష్ణకుమార్ రామ్‌కుమార్, నటుడు రెడిన్ కింగ్‌స్లీ, హీరో రుద్ర తదితరులు పాల్గొన్నారు. ఇందులో విష్ణు విశాల్ మాట్లాడుతూ.. 'రుద్ర తల్లిదండ్రులకు నేను ఎంతగానో రుణపడివున్నా. రుద్రను హీరోగా పరిచయం చేయడానికి గల కారణం ఇప్పటికే మీకు అర్థమైవుంటుంది. నేను హీరో కావాలని రుద్ర తల్లిదండ్రులు ఒత్తిడే. ఆ కారణంగానే నేను ఈ స్థాయిలో ఉన్నా. ఇంతకాలం నాకు మద్దతు ఇచ్చినట్టుగానే రుద్రకు ఇవ్వాలని కోరుతున్నా' అని పేర్కొన్నారు. దర్శకుడు వెట్రిమారన్ మాట్లాడుతూ.. 'చిత్రంలోని పాటలన్నీ బాగున్నాయి. ఇందులో నటించిన వారిద్దరు కూడా నిజంగానే స్నేహితులుగానే ఉన్నారు. సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని పేర్కొన్నారు. హీరో రుద్ర మాట్లాడుతూ... 'ఈ అరుదైన తరుణం కోసం ఎన్నో రోజులుగా వేచి చూస్తున్నా. ఇపుడు నా కల నిజమైంది. మా అన్న నన్ను హీరోగా పరిచయం చేస్తున్నారు. నా తొలి స్నేహితుడు సినిమానే. అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి హీరో కావొచ్చని కార్తిని చూసి గ్రహించా. మా అన్నను ఆదరించినట్టుగానే నన్ను కూడా ఆదరించాలని కోరుతున్నా' అని పేర్కొన్నారు. దర్శకుడు కృష్ణకుమార్ రామ్‌కుమార్ మాట్లాడుతూ... 'నటుడిగా కెరీర్ ప్రారంభించినప్పటి నుంచి దర్శకుడి వరకు ఆదరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. అయితే, దర్శకుడి తర్వాత నా సినిమా మాట్లాడాలి. మేం ఏం చేశామన్నది జూలై 11న తెలుస్తుంది. సాధారణంగా హీరోకు దర్శకుడు స్టోరీ వినిపిస్తాడు. కానీ, ఇక్కడ నాకు రుద్ర కథ చెప్పాడు. ఒక నటుడిగా రుద్ర మలుచుకున్నాడు' అన్నారు.

పది చిత్రాలను నిర్మించనున్న వేల్స్



డాక్టర్ ఐసరి కె.గణేష్

ప్రముఖ నిర్మాత డాక్టర్ ఐసరి కె.గణేష్ తమ సొంత నిర్మాణ సంస్థ వేల్స్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై పది చిత్రాలను నిర్మించనున్నారు. 2025-27 వరకు ఈ పది సినిమాలను నిర్మించేలా ప్లాన్ చేసినట్టు ఆయన తాజాగా వెల్లడించారు. ఈ చిత్రాలకు దర్శకత్వం వహించే దర్శకుల వివరాలకు సంబంధించిన వీడియోను కూడా రిలీజ్ చేశారు. ఈ దర్శకుల జాబితాలో సుందర్, గౌతమ్ వాసుదేవ్ మీనన్, వెట్రివారన్, మారి సెల్వరాజ్, ప్రేమ్ కుమార్, జూట్ ఆంటోని, అరుణ్‌రాజా కామరాజ్, విఘ్నేష్ రాజా, సెల్వ అయ్యావు, గణేష్ బాబు ఉన్నారు. ఇందులో విజే సింధు దర్శకురాలిగా పరిచయమయ్యే చిత్రం కూడా ఉంది. ఇందులో ధనుష్, రవి మోహన్, నయనతార, విష్ణు విశాల్ నటించనున్నారు.

చిత్రజ్యోతి

'అన్నాచ్చి' శరవణన్ సరసన పాయల్ రాజ్‌పుత్



పాయల్ రాజ్‌పుత్



కేక్ కట్టింగ్ సెలెబ్రేషన్ వేడుకల్లో చిత్ర బృందం

● దీపావళికి రిలీజ్

ప్రముఖ జౌళి వ్యాపారి 'లెజెండ్' శరవణన్ (అన్నాచ్చి) సరసన ప్రముఖ హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ నటిస్తున్నారు. అన్నాచ్చి తన తొలి చిత్రంగా 'లెజెండ్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. దీంతో ఆయన పేరు 'లెజెండ్' శరవణన్‌గా మారిపోయింది. ఇపుడు ఆయన రెండో చిత్రంలో నటిస్తున్నారు. సెంథిల్ కుమార్ దర్శకుడు. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ చిత్రంలో పాయల్ రాజ్‌పుత్ హీరోయిన్. ఇతర పాత్రల్లో శ్యామ్, ఆండ్రియా, బాహుబలి ప్రభాకర్, సంతోష్ ప్రతాప్ తదితరులు నటించారు. జిబ్రాన్ సంగీతం. కెమెరా ఎస్.వెంకటేష్. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిత్రం బృందంతో కలిసి అన్నాచ్చి కేక్ కట్టింగ్ వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ, 'సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని, పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నాం. మాస్, యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లర్ స్టోరీగా నేటి ట్రెండ్‌కు అనుగుణంగా రూపొందిస్తున్నాం. దీపావళికి విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు.



కొడైకెనాల్‌లో విరబూసిన 'నెదర్లాండ్స్ లిల్లీ' పుష్పాలు

చెన్నై, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌లో 'నెథర్లాండ్స్ లిల్లీ' పుష్పాలు విరబూసి పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. ఈ లిల్లీ పుష్పాలు యేడాదికి ఒకసారి మాత్రమే పుష్పిస్తాయి. కొడైకెనాల్‌లోని బ్రయింట్ పార్కు, రోస్ పార్కుల్లో రాష్ట్ర ఉద్యానవనాల శాఖ అధికారులు ఈ నెథర్లాండ్స్ లిల్లీ పుష్పాల మొక్కలను నాటి, వాటిని సంరక్షించారు. ఇటీవల కొడైకెనాల్ అంతటా చెదురుముదురు వర్షాలు పడి ఆహ్లాదకరమైన చల్లటి వాతావరం ఏర్పడింది. దీంతో బ్రయింట్ పార్కు, రోస్ గార్డెన్ ప్రాంతాల్లో ప్రస్తుతం గులాబీ, ఎరుపు, పసుపు, లేతాకుపచ్చ ఈ రంగులతో నెథర్లాండ్స్ లిల్లీ పుష్పాలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ఈ పుష్పాలు 15 రోజులు దాకా వాడకుండా ఉంటూ సుగంధ పరిమళాలను వెదజల్లుతాయని ఉద్యానవన శాఖ ఉన్నతాధికాలు చెబుతున్నారు. ప్రస్తుతం కొడైకెనాల్‌కు ప్రత్యేక ఆకర్షణగా మారిన ఈ లిల్లీ పుష్పాలును చూడటానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారని పేర్కొన్నారు.

→ కొడైకెనాల్‌లో కనువిందు చేస్తున్న 'నెదర్లాండ్ లిల్లీ' పుష్పాలు

అకాల వర్షంతో అమ్ముడుపోని మామిడి పండ్లు

● సేలం మార్కెట్‌లో పేరుకుపోతున్న నిల్వలు



సేలం మార్కెట్‌లో మామిడి పండ్ల నిల్వలు

టి.నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండు వేసవిలో అకాల వర్షాలు కురవటంతో మామిడి పండ్ల విక్రయాలు తగ్గిపోయాయి. ప్రస్తుతం సేలం జిల్లాలోని మార్కెట్లలో టన్నుల చొప్పున మామిడి పండ్లు పేరుతుపోతున్నాయి. సేలం అంటేనే అందరికీ గుర్తుకొచ్చేది మామిడి పండ్లే. ఆ తీయటి మామిడి పండ్లు భారతదేశంలోని పలు నగరాలకే కాకుండా విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్నాయి. అయోధ్యపట్టినం, కుప్పనూరు, వలసైయూరు, కారిపట్టి, వాళప్పాడి, ఆత్తూర్, వనవాసి, జలకంఠపురం, ఎడప్పాడి, నంగవళ్ళి, పనమరత్తుపట్టి, మల్లూరు సహా జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ, ధర్మపురం, కృష్ణగిరి జిల్లాల్లోనూ అత్యధికంగా పండిస్తున్నారు. ఆ ప్రాంతాల నుండి టన్నులకొద్దీ మామిడి పండ్లు సేలంలోని పెద్ద మార్కెట్లకు రవాణా అవుతున్నాయి. సేలం గుండు, సేలం బెంగుళూరా, అల్ఫోన్సా, ఇమామ్ పసంద్, బంగినపల్లి, మల్గోబా, సెందూరా, కుదాత్, చిలుకముక్కు సహా పలు రకాల మామిడి పండ్లు సేలం నగరంలోనే అత్యధికంగా అమ్ముడవుతాయి. ఈక్రమంలో సేలంలోని పెద్ద మార్కెట్లకు రోజూ 500 టన్నుల కంటే అధికంగా మామిడిపండ్లు చేరుతున్నాయి. అయితే ఈ యేడాది అగ్నినక్షత్రం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి దాకా ఎండవేడిమి తగ్గి అకాల వర్షాలు అధికమయ్యాయి. నెల రోజులకు పైగా చెదురుముదురుగా వర్షాలు కురవటంతో అన్ని చల్లటి వాతావరణం నెలకొంది. దీనితో మామిడి పండ్లు తింటే పడిశం పట్టుకుంటుందని ప్రజలు తక్కువగానే కొనుగోలు చేస్తున్నారు. దీంతో ధరలు పతనమయ్యాయి. ముఖ్యంగా 5 కేజీల చిలుకముక్కు మామిడిపండ్లను రూ.100కు విక్రయిస్తున్నారు. ఇలా ధర విపరీతంగా తగ్గినా కూడా వాటిని కొనటానికి ప్రజలు ఆసక్తి చూపటం లేదు. పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అందనంత నష్టపోయామని, రాష్ట్ర ప్రభుత్వం తమకు తగు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మామిడి పండ్ల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏలగిరి వేసవి ఉత్సవాలు ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి వేడుకలను ప్రారంభిస్తున్న మంత్రులు ఏవీ వేలు, రాజేంద్రన్ తదితరులు

ప్యారీస్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు జిల్లా ఏలగిరి పర్వతశ్రేణులపై వేసవి ఉత్సవాలను రాష్ట్ర మంత్రులు ఏవీ వేలు, రాజేంద్రన్ ఆదివారం ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ శివసౌందర్యవల్లి అధ్యక్షత వహించగా జిల్లా గ్రామీణాభివృద్ధి పథకం డైరెక్టర్ ఉమా మహేశ్వరి స్వాగతం పలికారు. ఎంపీలు సీఎన్ అన్నాదురై, కదిర్ ఆనంద్, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, అన్ని ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు. వేసవి ఉత్సవాల సందర్భంగా ఏలగిరి కొండ, అడవుల్లో పండించే ఆహార ధాన్యం, పండ్లు, ఔషధ మొక్కలతో తయారుచేసే మందులు తదితరాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ప్రారంభోత్సవంలో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి రాజేంద్రన్ మాట్లాడుతూ... ఏలగిరి వేసవి విడిది కేంద్రం ఉండడంతో ఇక్కడికి సంవత్సరమంతా స్వదేశీ, విదేశీ పర్యాటకులు వచ్చివెళ్తున్నారని, 30 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఏలగిరిలో సహజసిద్ధమైన పార్కు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, సర్యూట్ హౌస్, నీలావూరు సరస్సు, ఆంజనేయస్వామి ఆలయం, మంగళం చెరువు, బోట్ హౌస్‌లు ఉన్నాయన్నారు. సంవత్సరమంతా చల్లటివాతావరణం సంతరించుకున్న ఏలగిరికి వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం రోప్‌కార్ వసతి కల్పించేందుకు ప్రభుత్వం అనుమతించిందన్నారు. దీనికి సంబంధించిన నివేదికను త్వరలోనే సీఎం స్టాలిన్‌కు సమర్పించనున్నట్లు మంత్రి తెలిపారు.

మద్యం తాగితే స్తంభానికి కట్టేయడమే!

● జాలర్ల గ్రామంలో కొత్త తీర్మానాలు



గ్రామంలో ఏర్పాటు చేసిన తీర్మానాల బ్యానర్

పెరంబూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లాలో జాలర్లు అధికంగా నివసించే ఓ కుగ్రామంలో మద్యం తాగి వచ్చే వారిని రోజంతా ఆలయ స్తంభానికి కట్టివేయడం, మహిళలను ఎగతాళి చేసే వారికి గుండు కొట్టించడం వంటి తీర్మానాలను గ్రామసభలో ఆమోదించి, అమ లు చేస్తున్నారు. గ్రామసభలో చేసిన తీర్మానాలను అందరికీ తెలిసేలా బ్యానర్లు కూడా కట్టారు. నాగపట్టినం జిల్లా వేదారణ్యం సమీపం పంచనాతికులం నడుచేది పంచాయతీ పరిధిలోని సిరుతలైకాడులో సుమారు 2,000 మంది నివసిస్తున్నారు. వీరికి చేపల వృత్తి ప్రధానమైనది. కొంతకాలంగా గ్రామానికి చెందిన యువకులు మద్యానికి బానిసలు మారడం ఆందోళనకు గురిచేసింది. ఆ సమస్య పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు నిర్ణయించారు. గ్రామ పెద్ద నామకోటి నేతృత్వంలో శనివారం గ్రామస్తులు సమావేశమయ్యారు. మద్యం తాగి గ్రామంలో ప్రవేశించి ఘర్షణలకు పాల్పడే వారిని మారియమ్మన్ ఆలయ స్తంభానికి రోజంతా కట్టిపడేయాలని, వారి వాహనాలు స్వాధీనం చేసుకోవాలని మొదటి తీర్మానం చేశారు. ఇక మహిళలను ఎగతాళి చేయడం, ప్రేమ పేరుతో యువతుల వెంటపడడం తదితర ఘటనలకు పాల్పడే వారిని గుర్తించి ఆలయం ముందు గుండు గీయించాలని రెండో తీర్మానం చేశారు. ఈ తీర్మానాలు అందరూ తెలుసుకునేలా గ్రామంలోని పలు ప్రాంతాల్లో బ్యానర్లు ఏర్పాటుచేశారు.

గోమాతకు సీమంతం



గోమాత సీమంత వేడుకల్లో అజంతా శంకరరావు, దయాలం పుష్పాంబ తదితరులు

ప్యారీస్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలోని జీవులతో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ భారతీయ సంప్రదాయంలో ప్రత్యేక స్థానం గోవుకు నగరంలోని గోమాత సేవా సమితి అత్యంత ఘనంగా సీమంతం వేడుకలు నిర్వహించింది. గోమాత సేవా సమితి దశమ వార్షికోత్సవం సందర్భంగా షావుకారుపేటలోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో గోశాలలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు వాసవీ మాత పూజలతో గోమాత సీమంత వేడుకలు ప్రారంభమయ్యాయి.అష్టఐశ్వరాలు, సంపూర్ణ ఆరోగ్యం కలగాలన్న ఆకాంక్షతో లోకకల్యాణార్థం వేదమంత్రాలు, భక్తు దివ్యనామస్మరణల మధ్య సీమంతం నిర్వహించారు. సమితి వ్యవస్థాపక సలహాదారులు అజంతా డాక్టర్ కనిగెలుపుల శంకరరావు, ఫౌండర్ దయాలం పుష్పాంబల పర్యవేక్షణలో గోమాతకు పసుపు కుంకుమ రాసి కొమ్ములను గాజులతో అలంకరించి కొత్త వస్త్రాలను సమర్పించి ప్రదక్షిణలు చేశారు. ఈ వేడుకలకు మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. నిర్వాహకులు తాతా నిరంజన్, కార్యదర్శి దయాలం వాసుదేవన్, కమిటీ సభ్యులు అడ్వకెట్ కనిగెలుపుల శ్రీనివాసమూర్తి, దేసు లక్ష్మీనారాయణ, మన్నారు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. చివరగా భక్తులందరికీ అన్నప్రసాదాలు, ముత్తైదువులకు పసుసు, కుంకుమ పంపిణీ చేశారు.



తిరుచెందూరు మహాకుంభాభిషేకం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో స్వర్ణమండపం రీతిలో నిర్మించిన యాగశాల పందిరి



చెన్నై సవేరా హోటల్ ప్రాంగణం వద్ద ఆదివారం ఉదయం ఇండియన్ ఆయిల్ - ది డచెస్ ఆల్ విమెన్ కార్ల ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రముఖ సినీ నటి సుహాసిని మణిరత్నం



పర్యాటకులు లేక గట్టుకే పరిమితమైన బోట్లు

జిల్లుమంటున్న ఊటీ

పెరంబూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఊటీలో వర్షంతో కూడిన చల్లటి వాతావరణం నెలకొనడంతో బోట్ హౌస్ సందర్శకులు లేక నిర్మానుష్యంగా దర్శనమిస్తోంది. ఊటీలోని బొటానికల్ పార్కు, రోజా పార్కు, దొడ్డబెట్ట, బోట్ హౌస్ ప్రాంతాలు ప్రతిరోజు సందర్శకులతో కళకళలాడుతుంటాయి. ముఖ్యంగా, ఊటీకి వచ్చే ప్రయాణికులు బోటు సవారీకి ఆసక్తి చూపుతుంటారు. ఈ నేపథ్యంలో, మూడు రోజులుగా జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో, ఊటీలో చల్లటి వాతావరణం నెలకొంది. దీంతో, ఊటీకి వచ్చిన పర్యాటకులు తాము బసచేస్తున్న విడిది గృహాలకే పరిమితమయ్యారు.

కొడైకెనాల్‌కు సందర్శకుల అనుమతి

దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌లో అటవీ శాఖ నియంత్రణలో ఉన్న ప్రధాన పర్యాటక ప్రదేశాలకు పర్యాటకులను అనుమతించనున్నారు. ఈ ప్రాంతాల్లో ఏనుగుల గుంపు మకాం వేయడంతో, భద్రత దృష్ట్యా పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకు నిషేధం విధించారు. ప్రస్తుతం ఏనుగు గుంపు ఆ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడంతో, కొడైకెనాల్‌లోని మోయర్ స్క్వేర్, పైన్ ఫారెస్ట్, గుణ గుహ, తున్ రాక్, బేరిజం సరస్సు ప్రాంతాలకు శనివారం నుంచి పర్యాటకులను అనుమతిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పారిశ్రామికవేత్త హెచ్‌ఎం రామాంజినికి డాక్టరేట్



గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించిన రామాంజిని

చెన్నై, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త ఆర్‌ఆర్‌జీ గ్రూప్స్, ఆర్‌ఆర్ గౌడ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ హెచ్‌ఎం రామాంజినికి గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. నిరుపేదలను, బలహీనవర్గాలవారిని ఆదుకునేందుకు తన సంస్థ ద్వారా చేసిన సామాజిక సేవలకు గుర్తింపుగా చెన్నై భారతీయ విద్యాభవన్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ఈ డాక్టరేట్‌ను అందజేసినట్లు ఆ వర్శిటీ నిర్వాహకులు తెలిపారు. వర్శిటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పి. మాన్యుయేల్ హెచ్‌ఎం సుబ్రమణి, హెచ్‌ఆర్ రాజు, దాసరి గోపాలకృష్ణన్, హెచ్‌ఆర్ సురేష్ గౌడ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.